# రామేశం రైలు ప్రయాణం

జమీన్ రైతు ఉగాది సంచిక 7-4-1970

Less Luggage More Comfort
Make Travel A Pleasure

—జయప్రద

'లెస్ లగేజ్ మోర్ కంఫర్ట్:
మేక్ ట్రావెల్ ఎ ప్లెజర్'

ఉలిక్కిపడి, సర్దుతున్న సామానును ప్రక్కకునెట్టి వెనక్కు తిరిగి భర్తవైపు ప్రశ్నార్థకంగా చూసింది కమల.

'ఎంత తక్కువ సామానుంటే అంత సౌకర్యంగా ప్రయాణం చెయ్యొచ్చ'ని దానర్థం. విశదీకరించాడు రామేశం.

"పోదురూ, మీది మరీ సోద్యం" అని కమల యథాప్రకారం చిరునవ్వుతో సామాను సర్దుకోసాగింది. రామేశానికి మండిపోయింది.

"ఇదిగో నీకే చెప్పేది. నీకేం మహారాణిలా చంటిదాన్ని చంక నేసుకుని గబుక్కున దూరేస్తావు. ఇంక నువ్వుతెచ్చే గోనెసంచి దగ్గర నుండి చెంబు తప్పేలావరకు ఈ రామేశంగాడే చూసుకుని అఘోరించాలి."

"అదికాదండీ. మనం ఇవన్నీ తీసుకెళ్ళకపోతే మన అవసరాలు తీరేదెలా?" అమాయకంగా ముఖంపెట్టి అడుగుతున్న భార్యను చూస్తే జాలి వేసింది రామేశానికి. అంతగా కోప్పడకుండా వుండాల్సింది" అనుకున్నాడు మనసులో.

"అదికాదు కమలా! నే చెప్పేది విని కాస్త అర్థం చేసుకో. ఈ మధ్య రైల్లో మనుషులకే స్థలం దొరకడంలేదుకదా! ఇక ఇంత సామానుతో వెళితే ఎంత ఇరుకుగా వుంటుందో, అది మనకెంత బాధగా వుంటుందో ఆలోచించు."

కమల రామేశాన్ని పూర్తిగా అర్థం చేసుకుంది.

"నిజమేనండీ. ఫస్టుక్లాస్, సెకండ్‌క్లాస్, టూ టైర్, త్రీటైర్ రిజర్వేషన్ కంపార్టుమెంట్లు. మిలటరీ కంపార్టుమెంటు. ప్రత్యేకంగా కాలేజీ ఎక్స్‌కర్షన్లకు కేటాయించిన కంపార్టుమెంట్లు. లేడీస్ కంపార్టుమెంట్లు పోతే మిగిలే కామన్ కంపార్టుమెంటులో మనుషులూ, సామానుకూడా సర్దుకోవాలంటే కష్టమేమరి!"

భార్యామణియొక్క అర్థం చేసుకునే కెపాసిటీకి రామేశం మురిసిపోయేంతలో కమలకు పెద్ద ధర్మసందేహ మొచ్చింది.

"అంతా బాగానే వుందండీ! కానీ మనలాగే అందరూ చేతులూపుకుంటూ రారుకదా! పరాయివాళ్ళ సామానుమధ్య ముడుచుకునికూర్చునే కంటే మన సామానుమధ్య ధర్జాగా కూర్చోవచ్చుగదా!"

తన అర్ధాంగి పెంకితనానికి ఈ మారు నిజంగానే కోపమొచ్చింది రామేశానికి.

"ఏయ్!" అని కోప్పడబోయేంతలో కమల అందుకుంది-

"అవునులెండి. మీరు చెప్పింది పాయింటే. ఈ మధ్య రైళ్ళను నమ్మలేకుండా వున్నాం. ఏ క్షణాన పడిపోతాయో తెలీడంలేదు, ఎందుకు అనవసరంగా బంగారంలాంటి వస్తువులను పోగొట్టుకోవడం తేనులెండి"

"అదేనిటీ!" గాభరా పడ్డాడు రామేశం. కమలకు మతిపోయిం దనుకున్నాడు. 'లేకపోతే చెట్టంత రామేశం, కమలమ్మ ప్రాణాలు పోగాలేంధి వెధవ సామానుకొచ్చిందా?' తన అనుమానాన్ని మనసు లోనే దాచేసుకున్నాడు. ఎలాగయితేనేమి తన అర్ధభాగం ఒప్పుకుంది అంతే చాలనుకున్నాడు.

"నువ్వు మంచిదానివి కమలా" అన్నారు మొదట. వెంటనే 'అసలు కమల తెలివిగలదై తేనూ' అన్నాడు.

"నీకు ఇంగ్లీష్ బాగా రాదనేగాని లేకపోతే ఎప్పుడో అర్ధం చేసు కునేదానివి" అన్నాడు.

దేనికీ మాట్లాడలేదు కమల. భర్తవంక చిద్విలాసంగా చూస్తోంది. అలా చూసిచూసి-

"అయితే నన్నిప్పుడేం చేయమంటారు? అందులో ఏమేమి మైనస్ చెయ్యను?" అని అడిగింది.

భుజాలెగరేసాడు రామేశం. తన భార్యారత్నం తన మాటకు అంత గౌరవం ఇచ్చినందుకు.

"ముందా మరచెంబు తీసెయ్యి" అన్నాడు తెచ్చిపెట్టుకున్న గాంభీర్యంతో.

నవ్వు చెరగకుండా మరచెంబు పక్కన బెట్టింది కమల. డబ్బా లతో నిండుకున్న బుట్ట దగ్గరకు నడిచాడు రామేశం.

"ఇవెందుకూ?" అన్నాడు పాలపీక, పాలపిండిడబ్బా, పంచదార డబ్బా వగైరాలవైపు చూస్తూ.

"పాప పాలకి" చాలా నిదానంగా చెప్పింది కమల.

"ఆఁ ఒక్కరోజుకు కొనుక్కుందాం లెద్దూ"

"పాలపీకలుకూడా స్టేషన్‌లో అమ్ముతారా?" ముఖంనిండా అమాయకత నింపుకుని, కళ్ళతో నవ్వుతూ అడిగింది సదరు పాప తాలూకు తల్లి.

"నీకు ఒక్కొక్కప్పుడు అసలు బుర్ర పనిచెయ్యదు కమలా. లేకపోతే గ్లాసుతో త్రాగిస్తే వద్దందా నీ కూతురు."

తన ప్రత్యక్షదైవం తాలూకు అమాయకత్వాన్ని చిరునవ్వుతో స్వీకరించి పతి ఆజ్ఞమేర పాలపీకతో సహా బుట్ట అవతల పెట్టేసింది.

ఇంకా రామేశం కళ్ళు సామాను మీదికి పరుగు తీస్తున్నాయి. కమలమ్మ చేతులు ఒక్కొక్క సామానే ప్రక్కకు నెడుతున్నాయి. మొత్తానికి రెండు 'సూట్‌కేస్'లు తయారయ్యాయి. రామేశానికి కూడా నచ్చలేదు. కమలను ప్రక్కన కూర్చోబెట్టుకుని బుజ్జగించ సాగాడు.

"కమలా డియర్! మనమెళ్ళేది నాలుగునాళ్ళ భాగ్యానికి రెండు భోషాణాలెందుకు చెప్పు. అన్ని పెట్టెలూ కలిపి ఒకదాంట్లో సర్దేద్దూ. ఎంచక్కా పోర్టరు గొడవ లేకుండా స్టైలుల్‌గా మన మెళ్ళవచ్చు."

నిర్వికారంగా చూసింది కమల.

ఒక్క సూట్‌కేస్‌తో స్టయిల్‌గా వెళుతున్న కొడుకుని, కోడలిని వాళ్ళ ప్రక్కన నడుస్తున్న మనుషుల్ని చూసి ముక్కుమీద వేలు వేసుకుంది సీతమ్మ.

"అదేమిటి కమలా? వాడికి మతిలేకపోతే నీకయినా లేకపోయిందా చంటాళ్ళను తీసుకెళుతూ లింగులింగుమంటూ ఒక తోలుపెట్టె వూపుకుంటూ తీసువెళితే సరిపోయిందా?"

కమల జవాబివ్వలేదు. భర్తవంక చూసింది సంజాయిషీ ఇచ్చుకోమన్నట్లు.

"నీకు తెలియదులేమ్మా! ఆ సామాను ఎక్కించుకోవడం, పోర్టర్లతో తగవులాడడం, పాసింజర్లచేత తిట్టించుకోవడం అబ్బా! అంతా నూసెన్స్.

ఇదేం మీ కాలమనుకున్నావా? రైళ్ళవాళ్ళు పాసింజర్లను బతిమిలాడి ఎక్కించుకోవడానికి.... చూస్తూండమ్మా! దర్జాగా వెళ్ళి నలగకుండ తిరిగొస్తాం" అనేసి హుషారుగా ఈలేసుకుంటూ రిక్షాఎక్కాడు రామేశం.

పాపం ఎంత ప్రయత్నించినా రిజర్వేషన్ కంపార్టుమెంటులో ఒక్క సీటైనా దొరకలేదు రామేశానికి.

"సీటు వుంచుకునీ ఇవ్వడంలేదు చూడు కమలా" అని భార్యకు కంప్లెయింట్ చేసాడు.

ఘరెవ్వరికి చెయటానికి ధైర్యంలేని రామేశం తనకు సానుభూతి ఇవ్వలేదు సరికదా! రైలువాళ్ళను సమర్ధించింది కమల.

"పాపం ఉత్త చేతులతో వెళ్ళిన మీకు సీటిచ్చేస్తే వాడి భార్యా బిడ్డలు బతికేదెలాగ? పైగా పాపం రికమెండేషన్లతో వచ్చేవాళ్ళ మాటేవిటి" అని.

ఎలాగో కష్టపడి అందరిని కిటకిటలాడే మామూలు కంపార్టు మెంటులో తోసుకుని ఊపిరి పీల్చుకున్నాడు.

'నీ సామానంతా తెచ్చుంటే ఇప్పుడేమయ్యేది మనగతి' అన్నట్లు భార్యవేపు చూసి ఎదురుగా వున్న 'లెస్ లగేజ్! బోర్డు చూపించి కాలర్ ఎత్తుకున్నాడు రామేశం.

నిల్చుని నిల్చుని కాళ్ళు నెప్పెట్టిన రామేశానికి హాయిగా తమ తమ సామాన్లమీద కూర్చుని కునుకు తీస్తున్న వాళ్ళను చూస్తే మరో సూట్ కేస్ తెచ్చుకోనందుకు మొదటిమారుగా చింతగలిగింది.

కానీ వెంటనే—పశ్చాత్తాపుడై మరోదారికి తన ఆలోచనలను మళ్ళించాడు.

పడుకున్న వాళ్ళను లేపి నిల్చునవాళ్ళను కూర్చోబెట్టే కాకీ ప్యాంటొకటి ప్రతి కంపార్టుమెంట్‌కి వుంటే బాగుణ్ను"

ఎలాగో సర్దుకుని కూర్చున్నాక-రైలు కుదుపులకు కునుకుపట్టిం దతనికి.

లీలగా ఎక్కడో చంటిదాని ఏడుపు వినిపించినట్టయి కళ్ళు తెరి చాడు.

పెట్టెదుట తన పుత్రికారత్నం తాలూకు తెరుచుకున్న బోసినోరు కన్నీళ్ళు కారుస్తున్న లేతకళ్ళు దర్శనమిచ్చాయి.

"ఏమంట?" విసుక్కున్నాడు రామేశం.

"ఆకలేస్తోందట" జవాబిచ్చింది కమల.

"పాలు త్రాగించరాదూ?" ఉచిత సలహా ఇచ్చాడు రామేశం.

"పాలపిండి తేలేదు" గుర్తుచేసింది కమల.

నాలిక్కరుచుకున్నాడు రామేశం.

"ఇట్లా ఇవ్వు. వూరుకోబెట్టడం నీకు తెలియదు" అని పిల్లదాన్ని భుజాన వేసుకున్నాడు.

పితృదేవుడనే భయం, భక్తి అన్నీ లేకుండా చంటి రాగాలాపన ఎక్కువ చేసింది. ప్రక్కావిడ విసుక్కుంది. ఒక ముసలావిడ అందు కుంది.

"ఏమమ్మా పసిగుడ్డును తెచ్చేప్పుడు పాలపిండి, వగయిరా తెచ్చు కోవాలని తెలీకపోతే ఎలాగా?"

"మావారు తేవద్దన్నారండి" అని గుట్టుచప్పుడు కాకుండా నిజం ఒప్పుకుంది. హరిశ్చంద్రుడి పక్కింటమ్మాయి కమల. ఆమె రామేశం వంక ఏగాదిగా చూసింది. అతనికి తేళ్ళూ, జెర్రులూ ప్రాకినట్టయింది. ఆ ముసలామె అలా చూసి వూరుకోలేదు.

"మగమహారాజులు వాళ్ళకేమ్మ చెప్తారు. పిల్లల ఆలనా పాలనా వాళ్ళకేం తెలుస్తుంది! ఏడిస్తే అమ్మకొడుకు, నవ్వితే నా కొడుకు అనే రకాలు పీళ్ళు. ఇప్పుడు తెమ్మను ఎక్కడినుంచి తెస్తాడో పాలు. చెప్పగానే సరిపోయిందా?" ఆమె దండకం చదువుతుంటే, బిక్కు బిక్కుమని చూస్తున్న భర్తనుచూస్తే జాలేసింది కమలకు. చంటిదానికి మటుకు కొద్దిగాకూడా కరుణ కలుగలేదు.

మొత్తానికి ఆ కంపార్ట్‌మెంట్‌లో వాళ్ళందరి చేతా తలా ఒక తిట్టు తిన్నాక ఒక స్టేషన్‌వస్తే అక్కడదూకి పాలు సంపాదించాడు రామేశం.

ఇప్పుడు మరలా క్రొత్త సమస్య తలెత్తింది. ఆ గాజుగ్లాసుతో ఆ పసిపాపకు పాలెలా త్రాగించడం?

కమల నిశ్శబ్దంగా పాపను,పాలను కూడా పతికి అందించింది. గ్లాసు నోటిదగ్గర పెట్టగానే ఆశపడిన పాప గ్లాసులోని పాలను నోట్లోకి తీసుకునే మార్గం కన్పించక నిరాశపడి, తన సంగీత సాధనను మరలా ప్రారంభించబోయింది.

"ఇదే మంచి తరుణం" అని తెరుచుకున్న నోట్లోకి పాలను దొర్లించాడు రామేశం.

దానికి పొరబొయ్యి నోట్లో పాలను తండ్రి షర్టుమీదికి జార్చేసింది. తన కూతురి పద్ధతేం నచ్చని రామేశం మెల్లిగా భార్యకు అందించబోయాడు కూతుర్ని ఎవ్వరూ చూడకుండా.

'నాచాత కాదండీ' అంది కమల నిస్పృహాయంగా.

ఇంతలో రెండుమూడు మార్లువచ్చి గ్లాసుకొరకు అడిగిపోయాడు పాలబ్బాయి.

"అప్పళంగా నలభయ్‌పైసలు పుచ్చుకుంటావే. అంత తొందర

అయితే ఎలాగరా?" అని వాడిమీద విరుచుకుపడ్డాడు ఆసలే విసిగి పోయిన రామేశం.

ఈ గోలంతా గమనిస్తున్న ఇందాకటి ముసలమ్మ అడగనే అడిగింది 'పాలసీసా తెచ్చుకోలా?"

రామేశం పై ప్రాణాలు పైనే పోయాయి. రక్షించమన్నట్లు అగ్నిసాక్షిగా పెళ్ళాడిన భార్య వైపు చూసాడు జాలిగా.

"తెచ్చామండీ పిన్నిగారు పెట్టె అడుగునుండి తీయడం కష్టమేమోనని" అంది సమయస్ఫూర్తిగా.

ఆ ముసలామె తాలూకు బోసినోటినుండి తనను రక్షించినందుకు రామేశం కృతజ్ఞతగా భార్య వైపు చూసాడు.

నాల్గవమారు పాలవాడు వచ్చి గ్లాసివ్వమని గొడవచెయ్యడం మొదలెట్టాడు. గోపాలానికి దిక్కుతోచలేదు. పసిదానిగొంతులోకి ఒక్క చుక్కన్నా పాలుపోలేదు. ఎలాగ?

పసిదానిపాట్లు చూసేసరికి ముసలిమనస్సు వెన్నలా కరిగిపోయినది. 'ఉండే పిల్లా నేను లోటా ఇస్తాను' అని తళతళ మెరిసే స్టీలు మరచెంబు గిరగిరాతిప్పి లోపలున్న చిన్న స్టీలుగ్లాసు తీసిస్తూ రామేశం గుండెల్లోకి మరో బాణం వదిలింది.

"ఆ పాలు లోటాలో పోసుకుని ముందు పాలవాడి గొడవ వదిలించుకో. ఆ తర్వాత నెమ్మదిగా పాలసీసా తీసి బిడ్డకు పాలుపట్టిద్దువుగాని" సన్నగా నవ్వుతూ గ్లాసందుకుంది కమల.

ఇలాటి ఘోరమైన విపత్తులోకూడా ఈమెకు నవ్వెలావస్తుందో రామేశానికి బోధపడలేదు.

మెల్లగా కమలమ్మ వరిగింది. సూట్‌కేస్ తెరచి అడుగునవున్న పాలసీసాతీసి ఓరగా భర్తవైపు చూచింది.

రామేశానికి ఈ క్షణంలో కమల తెలివికి మనస్ఫూర్తిగా ఏదైనా కానుకివ్వాలనిపించింది. 'మా కమల బంగారు' ఎవ్వరికీ వినిపించకుండా కమల చెవిలో అన్నాడు రామేశం.

పాలతో తడిసినషర్ట్ అంటుకుంటున్నది. బాత్‌రూమ్‌లో కెళ్ళాడు. కుళాయిలో నీళ్ళు రావడంలేదు. బాత్‌రూమ్‌లోనుండి వచ్చేస్తుంటే ఎదురుగుండా తళతళలాడుతూ ముసలమ్మ తాలూకు మరచెంబు కన్పించింది. 'అయ్యో! మరచెంబు తెచ్చుకోకపోతిమే!' అని ఒక్కక్షణం వాపోయినా మరలా ప్రభుత్వాన్ని ఉల్లంఘించే ఆలోచనలు కలుగుతున్నందుకు తనసితాన్నే నిందించుకున్నాడు. గుట్టుచప్పుడు కాకుండా వచ్చి భార్య ప్రక్కన కూర్చున్నాడు. కమల అడగనే అడిగింది 'ఏమండీ నీళ్ళు రావడంలేదా పాపం' అని..

'రాకపోతే ఏం మునిగిపోయింది' అని పైకి విసుక్కున్నా రామేశానికి లోపల కసిగానే వుంది. 'లెస్ లగేజ్....' అంటూ తనను మరచెంబు తేనివ్వని ఈ రైల్వేవాళ్ళు నీళ్ళయినా సప్లయ్ చేయకపోతే ఎలాగ?

ప్రక్కస్టేషన్ వచ్చింది. ఆరోక్లాసు చదువుతున్న అడ్డగాడికి దాహమేసింది. అమ్మనడిగాడు మెల్లగా.

"నీళ్ళు తేలేదురా. ఊర్కో. సోడావస్తే కొనిస్తాలే" అంది తల్లి.

వాడు వూర్కున్నాడు. వాడు వూర్కున్నందుకు వాడిని మనసులోనే దీవించాడు తండ్రి.

కానీ అన్న దాహం గురించి విని, దాహమైన ఆరేళ్ళకొడుకు మాత్రం మాట వినని మారాం చెయ్యడం మొదలెట్టాడు.

కమల వాడిని పిలిచి చెవిలో చెప్పింది. 'వెళ్ళి మీ నాన్నను అడగరా బాబూ' గతుక్కుమన్నాడు రామేశం.

ఇప్పటికే పరువుపోయింది. ఇప్పుడు మంచినీళ్ళు పుట్టించకపోతే ఇక్కడనుండే డైరెక్టుగా నరకానికిద్దేస్తారు వీళ్ళు. మార్గాన్వేషణలో

వాకిట్లోకొచ్చాడు. ప్లాట్‌ఫారం కటకటాల కవతలగా ఒక బావి వుంది. దాని ప్రక్కన ఒక కుళాయి వుంది. 'వాటర్ బాటిల్ వుంటే గబగబ వెళ్ళి పట్టుకురావచ్చు' అనుకున్నాడు.

ఒక్కక్షణం వెంటనే స్పృహ తెచ్చుకుని 'రారా' అన్నాడు చిన్న కొడుకు నుద్దేశించి. పెద్ద కొడుకుకూడా వెంటబడ్డాడు. ఇద్దరిని పరిగెత్తించుకుని బావిదగ్గరకి వెళ్ళాడు. అక్కడ పెద్ద 'క్యూ' వుంది. ఆ 'క్యూ' అంతా పూర్తయి చిన్నవాడి నోటికి కుళాయి వచ్చేసరికి పచ్చ జెండా వూపనే వూపారు. పెద్దవాడికి ఐదోక్లాసులో తను చదువుకున్న 'పచ్చజెండా' పాఠం గుర్తుకొచ్చింది.

"నాన్నోయ్! రైలు కదుల్తోంది వచ్చెయ్యినాన్నా!" అని వాడు రైలు వైపుకు పరుగెట్టాడు.

'ఒరేయ్ చిన్నా రారా రైలు పోతుంది' రామేశం చిన్నకొడుకును పిలిచాడు మర్యాదగా.

"ఉండు నాన్నా! ఒక్క గుక్కన్నా త్రాగలేదు" తను ఎక్కందే రైలు కదలదని వాడి ధీమా.

రైలు సన్నగా కదలడం మొదలెట్టింది. పెద్దాడు తన కంపార్ట్ మెంట్ తెలియక తికమకపడి ఏడుపుముఖం పెట్టాడు. ఇందులో ఎవరిని వదులుకోవాలో బోధపడలేదు రామేశానికి ఒక్కక్షణం.

"రైల్వేవాళ్ళ మాట ననుసరించి వాటర్‌బాటిల్ తెచ్చుకోని తమ లాటి సత్ప్రియాణీకుల కొరకయినా ప్రతిస్టేషన్‌లోనూ ఇన్ని మంచి నీళ్ళిచ్చే ఏర్పాటు చెయ్యకూడదా?" వాపోయాడు రామేశం.

కుళాయి కొడుకు ఏడుస్తున్నా లెక్కచేయకుండా రెక్కపట్టుకుని ఈడ్చుకుని పచ్చజెండా కొడుకు నిల్చొనున్న కంపార్టుమెంటు దగ్గర కొచ్చాడు. రైలు కాస్త స్పీడ్ అందుకుంది. పూర్తిగా నిరాశపడిపోయాడు రామేశం.

'కమల గొలుసులాగితే బాగుణ్ను' అనుకున్నాడు రామేశం. మనసును అర్థం చేసుకున్నట్టే రైలు ఆగిపోయింది. 'ఎలాగాయినా కమల పిరికిది' అనుకున్నాడు మనసులో. ఇప్పుడు వదలబోయే ఫైన్‌ని తలచుకుని.

ఇద్దరు పిల్లల్ని కంపార్టుమెంట్‌లోకి తోసి హడావుడిగా 'కమలా పెట్టెలో డబ్బెంత వుందో చూడు' అన్నాడు.

"ఎందుక్కు"

"ఒట్టి మొద్దువబ్బా! గొలుసులాగితే ఫైన్ కట్టక్కరలే."

"గొలుసెవరు లాగేరండి" పకపక నవ్వసాగింది కమల.

"మరి రైలెలా ఆగింది?" గొంతు తగ్గించి అడిగాడు.

"రైళ్ళు కదలడం, ఆగడంకూడా ఈ కాలంలో పెద్ద విచిత్ర మేనా? అయినా ఇంత చిన్నదానికే గొలుసు లాగుతాననుకున్నారా?" ఇంతవరకు తనుపడ్డ వ్యధనంతా మర్చిపోయి, భర్తను ఆట పట్టించ సాగింది కమల.

"అయితే నీ పిల్లలేమయి పోయినా నీకు చింతలేదన్నమాట" రామేశానికి తన అశక్తతలోనుండి, కోపం పుట్టుకొచ్చేస్తుంది.

"అవేం మాటలండీ చెట్టంత మగాడు నా కొడుకులకు అండగా వుండగా, నాకేం భయం?" అని కొంటెగా నవ్వింది.

"ఒక్క మరచెంబు తెచ్చుకుంటే ఏ గొడవా లేకపోనుకదా!" అంది ఫైనల్‌గా. రామేశం మరి మాట్లాడలేదు. చిన్న కొడుకును ఓదార్చడంలో మునిగిపోయింది కమల.

చిరు తిండితోపాటు ఇంటిలో వుండిపోయిన బుట్ట చాలా అవస్థలు తెచ్చిపెట్టింది. బెజవాడకి, ఏలూరుకి మధ్య రైలెక్కడా ఆగలేదు. దాంతో పిల్లల నోటి రంది కూడా ఆగనని మారాం చేసింది. బెజవాడలో

కడుపునిండా అన్నంతిన్నా, నోటి దురద తగ్గక విసిగించడం మొద లెట్టారు పిల్లలు. ఎదురుగుండా బ్రిటగుంట దొరసాని పిల్లలు తినే రొట్టె ముక్కలు వీళ్ళను మరీ 'స్టిములేట్' చేస్తున్నాయి.

ఆ క్షణంలో రామేశం దృఢంగా నిర్ణయించుకున్నాడు. ప్రభుత్వా నికి దరఖాస్తు పెట్టుకోవాలని– ప్రతి రైలుకి ఒక డైనింగ్‌కార్, ప్రతి కంపార్ట్‌మెంట్ నుండి డైనింగ్‌కార్‌కి వెళ్ళడానికి దోవవుండకపోతే ఎలా మరి?

రబ్బరుపట్ట తేలేదనే కోపంతో నానా హంగామా చేసిందిచంటిది. అన్ని గొడవలు తగ్గి పిల్లలు నిద్రపోయేవేళకు సామర్లకోట స్టేషన్ వచ్చింది. అక్కడ చాలామంది దిగిపోయారు. పై బెర్తుమీద వున్న సామాన్లతో సహా. రామేశానికి చాలా సంతోషం వేసింది. "కమలా! క్రింద బెర్తుమీద నువ్వూ పిల్లలు సర్దుకోండి. పై బెర్తుమీదికి నేను వెళ తున్నాను" అన్నాడు సంబరంగా. 'సరే' అంది కమల.

తను వేసుకున్న ఉలెక్ ప్యాంటువంక వంక చూచుకున్నాడు రామేశం.

కమలా పెట్టెతీసి ఒక లుంగీ యివ్వు" అన్నాడు బాత్‌రూమ్ వైపు వెళ్ళడానికి సాయపడుతూ.

"లుంగీలు తేలేదండీ. పెట్టె పట్టలేదు" అంది నిర్వికారంగా భార్యామని.

"మరి ఎలాగిప్పుడు?" అన్నాడు దీనంగా రామేశం.

ఒకటి కొనుక్కుందాంలెండి ప్రక్క స్టేషనులో" అంది కమల వస్తున్న నవ్వును పెదాలమధ్య బిగబెడుతూ.

"నీకు నవ్వులాటగానే వుంటుంది" అని విసుక్కున్నాడు రామేశం.

"మీరేకదా ఒక పెట్టెలో సర్దేయమన్నారు" అని తన పతిభక్తిని నిరూపించుకుంది కమల. రామేశం అలిగి రెండువందల రూపాయల ముచ్చటయిన ఉలెన్ ప్యాంటుతోనే పైకెక్కాడు. అక్కడనుండి అలకతీరాక కమలను కేకలేశాడు.

"పోనీ ఒక బెడ్‌షీట్ వుంటే ఇవ్వు."

"అదెక్కడిదీ" అని భర్త ధోరణికి విస్తుపోయింది కమల.

రామేశం మాట్లాడకుండా ముడుచుకున్నాడు.

వాల్తేరు స్టేషన్‌లో దిగేసరికి, వేకువజామున నాలుగయింది. పిల్లలు ముగ్గురూ నిద్రపోతున్నారు. చంటిదాన్ని కమల ఎత్తుకుంది. చిన్నాడిని రామేశం భుజాన వేసుకున్నాడు. పెద్దాడిని బలవంతంగా లేపి నిల్చోబెట్టాడు. వాడు నిల్చునే తూగుతున్నాడు. సూట్‌కేస్‌ది సమస్య అయిపోయింది. రామేశానికి పోర్టర్‌ని పిలవడం యిష్టంలేదు. నాలుగణాలు పోతాయని బెంగలేదుగాని, అన్ని సామానులు తగ్గించి మీరు చేసిన నిర్వాకమేముంది అని కమలమ్మ నిలదీస్తుందని భయపడ్డాడు. కానీ ఇక పిలవక తప్పలేదు. కూలీవాడు నలభయ్ పైసలు అడిగాడు.

"అదేవిటిరా?" అంటే.

"హెడ్‌లోడ్‌కి నలభయ్ పైసలేకదా బాబయ్యా" అన్నాడు పైగా.

"ఇది సగం హెడ్‌లోడే కదోయ్" అన్నాడు రామేశం తన తెలివినంతా ప్రదర్శిస్తూ.

"సగానికి రేటు నిర్ణయించలేదు బాబయ్యా" అన్నాడు వాడు మర్యాదగా.

"ఎలాగూ పోర్టర్‌చేత మోయిస్తున్నాము. ఇంకొక సూట్‌కేసు కూడా తెచ్చుంటేపోయేది" అని మనసులో అనుకుని.

"పోనీలేవోయ్-మీరు మాత్రం ఎలా బ్రతుకుతారు? అని తన ఉదారతను ప్రదర్శించాడు.

★ ★ ★ ★

ఒక్క "సూట్‌కేస్"తో వెళ్ళి బండెడు సామానుతో తిరిగొచ్చిన కొడుకును, కోడల్ని చూచి ఆశ్చర్యపడింది సీతమ్మ.

"ఏమే కమలా, మీ పుట్టింటోళ్ళు ఇంకెన్నాళ్ళు పెడతారేమిటి సారె?" అంది బుగ్గలు నొక్కుకుంటూ.

"నాకు కాదత్తయ్యా. ఈమారు అల్లుడికి పెట్టారు సారె" అని భర్తవైపు తిరిగి నవ్వింది కమల.

"అదేమిటిరా రాముడూ, అత్తగారింటినుండి తప్పేలాలతో సహా తెచ్చుకున్నావు. కొత్తకాపురం పెడతావా ఏమి?"

సదరు రాముడు సిగ్గుపడిపోయాడు.

"అదికాదమ్మా. వెళ్ళేటప్పుడు వీళ్ళతో వేగలేక చచ్చాను. అదీ గాక ఈ మధ్య రైళ్ళు పద్ధతులే బాగలేవమ్మా...."

"రైళ్ళు చెప్పా పెట్టకుండా కదిలిపోతున్నాయికదా నాన్నా" అని అందించాడు పెద్ద సుపుత్రుడు.

విరగబడి నవ్వింది కమల. ఆమె ఎందుకు నవ్వుతుందో రామేశానికొక్కడికే అర్ధమయింది. సీతమ్మ కలికాలాన్ని మరొక్కమారు దూషించి ఊరుకుంది.

❋